# తొలివెలుగు

TGTEL/26/A6221

TOLE VELUGGU JATIYAPATRIKA

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం | జాతీయ పత్రిక

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 22 | మంగళవారం | 18-8-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/- |
|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:22 | Tuesday | 18-8-2026 | Pages:08 | Cost:2/- |







## తెల్ల జెండా ఎగరేయండి.. ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక

- అడ్డువస్తే ఒమన్‌పై బాంబులతో దాడి చేస్తామని వ్యాఖ్యలు
- ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్, హమాస్‌తో తెరవెనుక చర్చలున్నాయని వెల్లడి
- గాజాపై ఇజ్రాయెల్ దాడులు చేయొద్దని సూచన
- ఇరాన్‌ను అణ్వస్త్ర శక్తిగా మారకుండా ఆపడమే ప్రధాన లక్ష్యమని స్పష్టీకరణ



ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 60 రోజుల కాల్పుల విరమణ గడువు ముగిసిన నేపథ్యంలో, ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని ఆయన అల్టిమేటం జారీ చేశారు. 'ఫాక్స్ న్యూస్'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ విషయంలో తాము తొందరపడటం లేదని, దీనికి ఎటువంటి కాలపరిమితి లేదని ఆయన స్పష్టం చేశారు. అమెరికా నౌకాదళ దిగ్బంధనం కారణంగా ఇరాన్ ఇప్పటికే రోజుకు వందల మిలియన్ల డాలర్లు

- మిగతా 2వ పేజీలో

## ఢిల్లీలో ప్రధానితో గోవా గవర్నర్ సమావేశం



- సింహాద్రి అప్పన్న దర్శనానికి ఆహ్వానం
- ప్రధాని మోదీతో గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు భేటీ
- సింహాద్రి అప్పన్న దర్శనానికి రావాలని ప్రధానికి ఆహ్వానం
- మోదీకి సింహాచలం నారసింహుని ప్రతిమను అందించిన రాజు
- దర్శనానికి వస్తానని ప్రధాని సూచించినట్లు వెల్లడి
- గోవా అభివృద్ధి కార్యక్రమాలపై ప్రధానికి వివరణ

గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు సోమవారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి (సింహాద్రి అప్పన్న) దర్శనార్థం రావాల్సిందిగా ఆయన ప్రధానిని సాదరంగా ఆహ్వానించారు. గోవా గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన నేపథ్యంలో అశోక్ గజపతి రాజు ప్రధానిని

- మిగతా 2వ పేజీలో

## నిజాలు బయటకు రావాలంటే సీబీఐ విచారణ ఒక్కటే సరైన మార్గం: బొత్స సత్యనారాయణ




- డీఎస్సీ అంశంపై శాసనమండలిలో వైసీపీ రచ్చ
- నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలన్న బొత్స సత్యనారాయణ
- నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందని మండిపాటుు

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సమావేశాలు మెగా డీఎస్సీ వివాదంతో తీవ్ర ఉద్రిక్తతల మధ్య ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం చేపట్టిన టీచర్ నియామకాల ప్రక్రియలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయంటూ ప్రతిపక్ష వైసీపీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. దీనిపై సభలో సమగ్ర చర్చ జరగాలని, బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు.



## వరంగల్‌లో పెద్ద మాటలు చెప్పి ఉన్న ఆస్పత్రిని కూల్చేశారు

- కూలిపోయే స్థితిలో ఉన్న ఉస్మానియాను నిర్వీర్యం చేశారు
- సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లలో ఆస్పత్రుల నిర్మాణం మర్చిపోయారు
- సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభోత్సవంలో కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజం
- ఆయన, కుటుంబ సభ్యులు పదేళ్లలో ఫాంహౌస్‌లు కట్టుకున్నారని మండిపాటు
- వైద్యంపై ఖర్చును భవిష్యత్తు పెట్టుబడిగా చూస్తున్నట్లు వెల్లడి
- 32 నెలల పాలనలో వైద్యంపై రూ. 21,800 కోట్లు ఖర్చు చేశామన్న సీఎం
- అదనపు సమయం పనిచేసే ప్రభుత్వ వైద్యులకు ఇన్సెంటివ్‌లు ఇస్తామని ప్రకటన

## గ్రేటర్ జిల్లాల్లో 43 లక్షల ఓటర్ల తొలగింపు!

- తెలంగాణలో 'సర్' ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ
- 3.68 కోట్ల నుంచి 2.64 కోట్లకు తగ్గిన ఓటర్లు
- ఫారాలివ్వని 73,39,235 మంది తొలగింపు
- 43 లక్షల మంది హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల వారే
- 92,87,577 మందికి నోటీసులు!
- విచారించనున్న 119 ఈఆర్వోలు, 892 మంది ఏఈఆర్వోలు
- విలేకరుల సమావేశంలో సీఈఓ సి.సుదర్శన్‌రెడ్డి వెల్లడి






## సభలోనైనా, బయటైనా.. డిబేట్ కు నేను రెడీ

- డీఎస్సీ 2025పై ఎక్కడైనా చర్చకు సిద్ధమని లోకేశ్ సవాల్
- ముఖ్యమంత్రి తొలి సంతకాన్ని అడ్డుకోవాలన్నదే వైసీపీ కుట్ర అని ఆరోపణ
- 148 రోజుల్లో 16,347 పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేశామని వెల్లడి
- డీఎస్సీపై వైసీపీ చేసిన ఆరోపణలన్నీ అవాస్తవమని తిప్పికొట్టిన మంత్రి
- ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని, విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తామని హామీ

"గొడ్డలి పార్టీ అధ్యక్షుడికి సవాల్ విసురుతున్నా. డీఎస్సీ-2025పై చర్చకు నేను సిద్ధం. సభ లోపలైనా, బయటైనా సరే.. టైమ్, డేట్ మీరే ఫిక్స్ చేయండి" అంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, వైసీపీ అధినేత జగన్ కు బహిరంగ సవాల్ విసిరారు. మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై


- మిగతా 2వ పేజీలో

## ఏపీపై ఎల్ నినో పంజా..

- తీవ్ర వర్షాభావంపై అసెంబ్లీలో చంద్రబాబు వివరణ
- రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్న చంద్రబాబు
- నవంబర్ వరకు అన్ని జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం అంచనా
- శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులకు భారీగా తగ్గిన నీటి ప్రవాహం
- నీటి సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్న సీఎం

రాష్ట్రంపై ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉందని, దీని కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్ నినో ప్రభావంపై శాసనసభలో సోమవారం జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు. ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే చాలా తక్కువగా నమోదవుతోందని, ఈ క్లిష్ట పరిస్థితిపై ప్రజలకు అసెంబ్లీ వేదికగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. ఈ ఏడాది వర్షపాతం అంచనాలను, వాస్తవ పరిస్థితులను ముఖ్యమంత్రి గణాంకాలతో సహా వివరించారు.

- మిగతా 2వ పేజీలో






## మండలిలో 'డీఎస్సీ' రగడ.. బొత్సకు అచ్చెన్నాయుడు కౌంటర్

- డీఎస్సీపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదన్న అచ్చెన్నాయుడు
- మెగా డీఎస్సీ-2025లో అవకతవకలపై సీబీఐ విచారణకు విపక్షం డిమాండ్
- విద్యాశాఖ మంత్రిగా బొత్స విఫలమయ్యారంటూ అచ్చెన్న విమర్శలు
- అచ్చెన్న వ్యాఖ్యలపై దుమారం, క్షమాపణ చెప్పాలని విపక్షం పట్టు
- గందరగోళం మధ్య శాసనమండలి రెండు సార్లు వాయిదా

# ఏపీపై ఎల్ నినో పంజా..

(మొదటి పేజీ తరువాయి)

2026 జూన్ నుంచి డిసెంబర్ వరకు రాష్ట్రంలో 867 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా, కేవలం 557 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని అంచనాలు చెబుతున్నాయని తెలిపారు. జులై నెలలో కొన్ని జిల్లాల్లో 68 శాతం లోటు వర్షపాతం నమోదైందని, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో 35 శాతం, అక్టోబర్‌లో 25 శాతం, నవంబర్‌లో 20 శాతం చొప్పున లోటు కొనసాగవచ్చని హెచ్చరించారు. అయితే, డిసెంబర్‌లో మాత్రం 1 శాతం అధిక వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని అన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలోని జలాశయాలు, ప్రాజెక్టులలో నీటి మట్టాలు వేగంగా అడుగంటుతున్నాయని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీశైలం జలాశయానికి ఈ సీజన్‌లో 753 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 214 టీఎంసీలు మాత్రమే వచ్చిందని సభకు తెలిపారు. ఎగువ రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రలలోని రిజర్వాయర్లు నిండిన తర్వాతే మనకు నీరు విడుదల చేస్తారని, ఈ కారణంగా శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులకు నీటి లభ్యత గణనీయంగా తగ్గిపోయిందని వివరించారు. కృష్ణా బేసిన్‌తో పాటు గోదావరి బేసిన్‌లోనూ ఇదే పరిస్థితి ఉందని అన్నారు. నీటి సమస్యలు కేవలం రాష్ట్రాల మధ్యే కాకుండా గ్రామాలు, దేశాల మధ్య కూడా తీవ్ర వివాదాలకు దారితీస్తున్నాయని, కావేరి జలాల వివాదమే ఇందుకు నిదర్శనమని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నీటి సంరక్షణ, వృథాను అరికట్టడంపై ప్రతిఒక్కరూ దృష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఢిల్లీలో ప్రధానితో గోవా గవర్నర్ సమావేశం ..

(మొదటి పేజీ తరువాయి)

మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో సింహాద్రి అప్పన్న స్వామివారి ప్రతిమను ఆయన ప్రధాని మోదీకి బహూకరించారు. ఆలయ ట్రస్ట్ తరఫున తాను ఈ ఆహ్వానాన్ని అందించినట్లు ఆయన పేర్కొన్నారు. తన ఆహ్వానంపై ప్రధాని సానుకూలంగా స్పందించారని, త్వరలోనే స్వామివారిని దర్శించుకుంటానని హామీ ఇచ్చినట్లు అశోక్ గజపతి రాజు వెల్లడించారు. ఈ భేటీలో గోవాలో కొనసాగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ ప్రాజెక్టుల పురోగతిని కూడా ఆయన ప్రధాని మోదీకి వివరించారు.

# నిజాలు బయటకు రావాలంటే సీబీఐ విచారణ ఒక్కటే సరైన మార్గం: బొత్స సత్యనారాయణ

(మొదటి పేజీ తరువాయి)

నియామకాల్లో చోటుచేసుకున్న అవకతవకలు, స్పోర్ట్స్ కోటా కేటాయింపుల్లో అవకతవకల్లో నిజాలు బయటకు రావాలంటే సీబీఐ విచారణ ఒక్కటే సరియైన మార్గమని ఆయన స్పష్టం చేశారు. శాసనమండలిలో వైసీపీ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని చైర్మన్ తిరస్కరించడంతో సభలో ఒక్కసారిగా కలకలం రేగింది. కూటమి ప్రభుత్వం 'మెగా డీఎస్సీ' పేరుతో నిరుద్యోగులను 'దగా డీఎస్సీ'గా మోసం చేసిందని విపక్ష సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. పరీక్షలు రాయని వారికి కూడా ఉద్యోగాలు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయని, ఉద్యోగాల బేరసారాలకు సంబంధించిన ఆడియో టేపులు బయటకు వచ్చినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక మర్మమేంటని బొత్స ప్రశ్నించారు. ప్రతిపక్షం లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వం చర్చ నుంచి పారిపోతోందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 నియామకాలపై అధికార పక్షం చేస్తున్న ఆరోపణలనూ ప్రస్తావించారు. నిజంగా గ్రూప్-1లో అక్రమాలు జరిగాయని భావిస్తే, దానితో పాటు ప్రస్తుత డీఎస్సీ ప్రక్రియపై కూడా ఒకేసారి సీబీఐ విచారణ వేయాలని ఆయన సవాల్ విసిరారు. రాష్ట్రంలో మూడేళ్ల క్రితం నుంచి ఉద్యోగార్థులు ఎదురుచూస్తున్న తరుణంలో, మెరిట్ జాబితా నిర్వహణలో పారదర్శకత లోపించిందని దుయ్యబట్టారు.

# తెల్ల జెండా ఎగరేయండి.. ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

నష్టపోతోందని ట్రంప్ పేర్కొన్నారు. ఆ దేశంపై ఈ వారంలో మరిన్ని ఆంక్షలు విధించే అవకాశం ఉందని సంకేతాలిచ్చారు. ఇరాన్ పాలకులు మంచి వ్యూహకర్తలని, కానీ ఆ దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం కుప్పకూలుతోందని వ్యాఖ్యానించారు. హర్మూజ్ జలసంధి నియంత్రణపై ఇరాన్, ఒమన్ మధ్య జరుగుతున్న చర్చలను ప్రస్తావిస్తూ.. "ఒకవేళ ఒమన్ అడ్డు వస్తే, వారిపై బాంబులతో విరుచుకుపడతాం" అని హెచ్చరించారు. ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్‌తో తమకు తెరవెనుక చర్చల మార్గం (బ్యాక్ ఛానల్) ఉందని ఆయన ధ్రువీకరించారు. ఇరాన్ అణ్వాయుధ శక్తిగా మారకుండా నిరోధించడమే తమ ప్రధాన లక్ష్యమని ట్రంప్ పునరుద్ఘాటించారు. ఇప్పటివరకు వినియోగించిన ఆయుధాలు చాలా చిన్నవని, బైడెన్ హయాంలో ఉక్రెయిన్‌కు అందించిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలు తమ వద్ద సిద్ధంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇదే సమయంలో, ఇజ్రాయెల్-హమాస్ వివాదంపై కూడా ట్రంప్ స్పందించారు. జారెడ్ కుష్నర్ ఈజిప్టులో హమాస్ నేత ఖలీల్ అల్-హయ్యాతో సమావేశమయ్యారని ఆయన వెల్లడించారు. హమాస్‌తో తమకు ప్రత్యామ్నాయ మార్గాల్లో చర్చలు జరుగుతున్నాయని, వారు ఆయుధాలు వీడుతున్నారని, ఈ నేపథ్యంలో గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగించాల్సిన అవసరం లేదని సూచించారు. అక్టోబర్‌లో జరగనున్న ఇజ్రాయెల్ ఎన్నికల్లో ఎవరికైనా మద్దతు ఇచ్చే అవకాశం ఉందని, అయితే ప్రస్తుతానికి ఈ వ్యవహారానికి దూరంగా ఉండటానికే మొగ్గు చూపుతానని ఆయన స్పష్టం చేశారు.



# వరంగల్‌లో పెద్ద మాటలు చెప్పి ఉన్న ఆస్పత్రిని కూల్చేశారు

హైదరాబాద్: 'కూలిపోయే పరిస్థితిలో ఉన్న వందేళ్ల నాటి ఉస్మానియా ఆస్పత్రిని తిరిగి నిర్మించాలని పదేళ్లు అధికారంలో ఉన్న వారు ఆలోచన చేయలేదు. సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లలో కొత్త ఆస్పత్రులకు టెంకాయ కొట్టి వాటి నిర్మాణం మర్చిపోయారు. వరంగల్‌లో పెద్ద మాటలు చెప్పి ఉన్న ఆసుపత్రిని కూల్చేశారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే వాళ్ల పార్టీ నాయకుడిని తీసుకొచ్చి ఇక్కడ (టిమ్స్ ఆస్పత్రి) కలియదిరిగారు. దీన్ని మేం కట్టాం.. రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తున్నాడన్నారు. నువ్వు నిజంగా కడితే రిబ్బన్ కట్ చేయడానికి పదేళ్లలో సమయం దొరకలేదా? కేసీఆర్ నాకు సాయం చేసినా చేయకున్నా అలాంటి కొడుకును తెలంగాణకు ఇచ్చినందుకు నాకు మేలు జరిగింది. నీ (కేసీఆర్) కొడుకు అట్లనే ఉండాలి.. అబద్ధాలు చెప్పాలి. అప్పుడే నిజాలు ప్రజలకు అర్థమవుతాయి'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన 1,082 పడకల (సూపర్ స్పెషాలిటీ) డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్)ను ఆయన ప్రారంభించారు. అనంతరం సీఎం మాట్లాడారు. 'కేసీఆర్‌కు ఎర్రవల్లిలో వెయ్యి ఎకరాల్లో ఫాంహౌస్.. ఆయన కుమారుడికి జన్వాడలో వంద ఎకరాల్లో ఫాంహౌస్.. ఆయన చెల్లికి శంకర్‌పల్లిలో 50 ఎకరాల్లో, బావ మొయినాబాద్‌లో 20 ఎకరాల్లో ఫాంహౌస్ కట్టుకున్నారు. అందులో ఏదైనా ఆగిందా? పేదల ఆస్పత్రులు ఏవైనా పూర్తి చేశారా? ఇంత కూడా ఆత్మపరిశీలన చేయకుండా సమాజం గమనిస్తుందని సిగ్గు పడకుండా నోటికొచ్చిన అబద్ధాలు చెప్పి బతకాలనుకుంటున్నారు. ఇకనైనా మీ బుద్ధి మారాలి. కరువు రావాలని అఘోర దీక్షలు, రైతులు చచ్చిపోవాలని చేతబడులు చేయించడం మానాలి. మీరు సంపాదించిన రూ. లక్ష కోట్లలో నియోజకవర్గానికి రూ. 10 కోట్లో లేదా రూ. 20 కోట్లో ఖర్చు చేస్తే.. నల్లమల, ఆదిలాబాద్ అడవుల్లో సేవలందిస్తే మీరు చేసిన పాపాలు తగ్గుతాయి'అని సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజాపాలనలో విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సంక్షేమం, అభివృద్ధిని ప్రాధాన్య అంశాలుగా తీసుకున్నామని సీఎం రేవంత్ చెప్పారు. ఇప్పటివరకు 16 వేల మంది వైద్య సిబ్బందిని నియమించామన్నారు. వైద్యంపై ఖర్చును సంక్షేమం, ఖర్చు కింద చూడటం లేదని.. భవిష్యత్తు కోసం పెట్టుబడి పెడిగా చూస్తున్నామని తెలిపారు. 'ప్రస్తుతం విద్య, వైద్యం అత్యంత ఖరీదైనవిగా మారాయి. పేదలు కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరితే ఆస్తులమ్మినా సరిపోక కిడ్నీలు అమ్ముకొనే పరిస్థితి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ అవగాహనతో ప్రజలకు ఉచిత, నాణ్యమైన వైద్యం అందించాలని నిర్ణయించింది. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే గుండె, కిడ్నీ బాగుండాలి. ఇందులో భాగంగానే మర్రి చెన్నారెడ్డి పేరుమీద వైద్య సాయం అందుబాటులోకి తెచ్చాం'అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. 32 నెలల పాలనలో ఆరోగ్యశ్రీ కోసం రూ. 2,700 కోట్లు కేటాయించామని, సీఎంఆర్‌ఎఫ్ రూ. 2,526 కోట్లు ఖర్చు చేశామని సీఎం వెల్లడించారు. ప్రజాప్రభుత్వంలో వైద్యం కోసం రూ. 21,800 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. ాష్ట్రంలో అత్యంత ప్రాధాన్యంతో ప్రభుత్వ ఆస్పత్రులను నిర్మిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గోషామహల్‌లో 2 వేల పడకల మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మిస్తున్నామని చెప్పారు. వచ్చే ఏడాదిన్నరలోగా.. 2027 డిసెంబర్ 9 నాటికి ఉస్మానియా ఆస్పత్రి, ఎల్బీ నగర్‌లో, అల్వాల్‌లో ఇలా ప్రతి ఆరు నెలలకో ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభిస్తామని చెప్పారు. దీనివల్ల 10 వేల ఆసుపత్రి పడకలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయన్నారు. ఆయా ప్రభుత్వ ఆస్పత్రులను నిమ్స్, ఎయిమ్స్‌తో పోటీ పడి సేవలందించేలా తీర్చిదిద్దుతామని చెప్పారు. రోగులకు ఉచిత భోజనం, రోగుల సహాయకులకు డార్మిటరీలు, ఇతర వసతులు కల్పిస్తామని వివరించారు.



# సభలోనైనా, బయటైనా.. డిబేట్ కు నేను రెడీ

శాసనసభలో సుదీర్ఘ ప్రకటన చేసిన ఆయన, ప్రతిపక్షంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తాను బెయిల్‌పై లేనని, తనపై సీబీఐ, ఈడీ కేసులు లేవని, విదేశాలకు వెళ్లేందుకు తనకేమీ కోర్టు అనుమతులు అవసరంలేదని ఎద్దేవా చేశారు. చర్చకు వస్తే వాస్తవాలు తేలుతాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన తొలి సంతకం మెగా డీఎస్సీపైనే అని లోకేశ్ గుర్తుచేశారు. ఈ నియామక ప్రక్రియను కేవలం 148 రోజుల్లో పూర్తి చేసి 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు. 3.36 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, టీసీఎస్ అయాన్ వంటి సురక్షిత ప్లాట్‌ఫామ్ ద్వారా అత్యంత పారదర్శకంగా పరీక్షలు నిర్వహించామని వివరించారు. ఈ డీఎస్సీని అడ్డుకోవడానికే వైసీపీ నాయకులు 141 కేసులు వేశారని, సీఎం తొలి సంతకం అమలు కాకుండా అడ్డుకోవాలని కుట్ర పన్నారని ఆరోపించారు. మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను లోకేశ్ తీవ్రంగా ఖండించారు. ప్రశ్నపత్రం లీక్ అయిందన్నది అవాస్తవమని, 42 వేల ప్రశ్నలతో కూడిన క్వశ్చన్ బ్యాంక్ నుంచి ర్యాండమ్‌గా ప్రశ్నలు వస్తాయని, లీకేజీకి ఆస్కారమే లేదని స్పష్టం చేశారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగికి ప్రశ్నపత్రం రూపకల్పనలో ప్రమేయం లేదని, అతను శాఖాపరమైన అనుమతులు తీసుకోనందునే అనర్హుడయ్యాడని తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో ఒకే సామాజికవర్గానికి మేలు చేశారన్న ఆరోపణలను తోసిపుచ్చారు. మొత్తం 372 మందిలో 46 మంది ఓసీ, 185 మంది బీసీ, 112 మంది ఎస్సీ, 29 మంది ఎస్టీ అభ్యర్థులు ఉన్నారని గణాంకాలతో సహా వివరించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే 65 క్రీడాంశాలను పరిగణనలోకి తీసుకున్నామని, శాప్ ఆధ్వర్యంలో పారదర్శకంగా వెరిఫికేషన్ జరిపామని పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని, ఫలితంగా 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లిపోయారని లోకేశ్ విమర్శించారు. టీడీపీ హయాంలోనే 1.80 లక్షల టీచర్ పోస్టులు భర్తీ చేశామని గుర్తుచేశారు. యువగళం పాదయాత్రలో కర్నూలు జిల్లాలో వలస కూలీల పిల్లల దుస్థితిని చూసి, మెగా డీఎస్సీ ద్వారా ఆ జిల్లాకు అధిక సంఖ్యలో టీచర్లను కేటాయించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అంబేద్కర్ రాజ్యాంగానికి అనుగుణంగా వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్లను పక్కాగా అమలు చేశామని, ఈ విధానాన్ని ప్రశ్నించడం రాజ్యాంగాన్ని అవమానించడమేనని అన్నారు.



# మండలిలో 'డీఎస్సీ' రగడ.. బొత్సకు అచ్చెన్నాయుడు కౌంటర్

గత ఐదేళ్ల పాలనలో నిరుద్యోగులకు 'మెగా డీఎస్సీ' ఇస్తామని ఆశలు రేపి, చివరికి ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా మోసం చేసిన వైసీపీకి ఇప్పుడు డీఎస్సీ నియామకాల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన బొత్స సత్యనారాయణ, నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకుని ఇప్పుడు మండలిలో డీఎస్సీపై నీతులు చెప్పడం సిగ్గుచేటని ఆయన ఘాటుగా విమర్శించారు. సోమవారం ప్రారంభమైన ఏపీ శాసనసభ వర్షాకాల సమావేశాల తొలిరోజే శాసనమండలి 'మెగా డీఎస్సీ-2025' అంశంతో దద్దరిల్లింది. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ వైసీపీ వాయిదా తీర్మానం ఇచ్చింది. దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. అయితే, మండలి చైర్మన్ కె. మోషేను రాజు వాయిదా తీర్మానాన్ని తిరస్కరించి, ప్రశ్నోత్తరాలు చేపట్టారు. ఈ అంశంపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. చైర్మన్ నిర్ణయంతో ఏకీభవించని వైసీపీ సభ్యులు, సభా కార్యకలాపాలను అడ్డుకుంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. డీఎస్సీ పేరుతో మూడు లక్షల మంది నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందని, క్రీడల కోటాలో తమకు నచ్చిన వారికి ఉద్యోగాలు కట్టబెట్టారని ఆరోపించారు. దీనిపై సభలో చర్చ జరగాలని పట్టుబట్టారు. బొత్స ఆరోపణలపై అచ్చెన్నాయుడు తీవ్రంగా స్పందించారు. "గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వని మీరు ఇప్పుడు మాట్లాడుతున్నారా? అధికారంలో ఉన్నప్పుడు చేతకాక, ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చాక మండలిలో ప్రశ్నలు వేయడం రాజకీయ ద్వంద్వ నీతి కాదా?" అని బొత్సను నిలదీశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులకు సకాలంలో ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు.

# గ్రేటర్ జిల్లాల్లో 43 లక్షల ఓటర్ల తొలగింపు!

రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ(సర్), 2026లో భాగంగా సోమవారం రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించారు. 'సర్--2026'ప్రక్రియ చేపట్టడానికి ముందు రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లుండగా, తాజాగా ప్రకటించిన ముసాయిదా జాబితాలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,64,87,213కు తగ్గిపోయింది. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) సి.సుదర్శన్ రెడ్డి సోమవారం తమ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేశారు. ఆచూకీ లేరు/శాశ్వతంగా నివాసం మారారు/చనిపోయారు/మరో చోట ఓటుకలిగి ఉన్నారు(ఏఎస్‌డీడీ) ..అనే కారణాలతో ఏకంగా 73,39235 మంది(21.7శాతం) ఓటర్లను ముసాయిదా ఓటర్ల జాబితాలో తొలగించారు. శాతాల వారీగా పరిశీలిస్తే రాష్ట్రంలో సగటున 21.7 శాతం ఓటర్లను తొలగించగా..హైదరాబాద్ జిల్లాలో అత్యధికంగా 40.99శాతం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 35.97శాతం, రంగారెడ్డి జిల్లాలో 34.79శాతం, ఓటర్లను తొలగించారు. సంఖ్యాపరంగా పరిశీలిస్తే హైదరాబాద్ జిల్లాలో 19,41,444 మంది, రంగారెడ్డి జిల్లాలో 12,87,091 మంది, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 10,71,566 మంది కలిపి ఈ మూడు జిల్లాలోని 28 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఏకంగా 43,00,101 మంది ఓటర్లను తొలగించారు. రాష్ట్రంలో తొలగించిన 73,39235 మంది ఓటర్లలో 58.59 శాతం ఓటర్లు ఈ మూడు జిల్లాలకు చెందినవారే కావడం గమనార్హం. ఇక అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే ..అత్యధికంగా ముషీరాబాద్‌లో 45.17%, సనత్‌నగర్‌లో 44.93%, మలక్‌పేటలో 44.76%, ఎల్బీనగర్‌లో 44.44%, జూబ్లీహిల్స్‌లో 44.14% శాతం ఓటర్లను తొలగించారు. సంఖ్యాపరంగా చూస్తే శేరిలింగంపల్లి 3,29,828, కుత్బుల్లాపూర్‌లో 2,76,924, ఎల్బీనగర్‌లో 2,70,284, రాజేంద్రనగర్‌లో 2,47,005, మహేశ్వరంలో 2,35,331, ఉప్పల్‌లో 2,18,323, మేడ్చల్‌లో 2,13,122 మంది ఓటర్లను తొలగించారు. ముసాయిదా జాబితాలోని 2,64,87,213 మంది ఓటర్లలో ఏకంగా 92,87,577 మంది(35.06%) ఓటర్ల పేర్లు అక్టోబర్ 19న ప్రకటించే తుది ఓటర్ల జాబితాలో వస్తుందో రాదో అనుమానమే. 'సర్'ప్రక్రియలో భాగంగా సమర్పించిన ఎన్యూమరేషన్ ఫారంలో సర్--2002 ఓటర్ల జాబితాలో తమ పేరు/తమ తల్లిదండ్రులు/వారి తల్లిదండ్రుల పేరు ఉన్నట్లు నమోదు చేయాల్సి ఉండగా, 32,36,659 మంది(12.22శాతం) ఓటర్లు ఈ వివరాలను అందించలేదు. దీంతో వారిని 2002 సర్ జాబితాలో అనుసంధానం కాని(అన్‌మ్యాప్డ్) ఓటర్లుగా గుర్తించారు. ఇక ఫారంలో ఈ వివరాలిచ్చిన వారిలో 60,50,918 మంది(22.84%) మంది ఓటర్ల వివరాల్లో వ్యత్యాసాలున్నట్లు నిర్ధారించారు. అంటే, ప్రస్తుత ఓటర్ల జాబితాలో పోల్చితే 2002 ఓటర్ల జాబితాలోని వీరి వివరాల్లో 11 రకాల వ్యత్యాసాలున్నాయని సీఈఓ సి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈ రెండు కేటగిరీలు కలిపి మొత్తం 92,87,577 మంది(35.06%) ఓటర్లకు స్థానిక ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు(ఈఆర్వోలు), ఏఈఆర్‌లు నోటీసులు జారీ సంజాయిషీ కోరనున్నారు. స్థానిక బీఎల్‌ఓలే సంబంధిత ఓటర్లకు నోటీసులు తీసుకొచ్చి ఇస్తారని, రాతపూర్వక సంజాయిషిని వారికి లేదా స్థానిక ఈఆర్వోకు సమర్పించాలని ఓటర్లకు సూచించారు.



# వందేమాతరం గీతాన్ని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత

- కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలకు నిరసనగా బీజేవైఎం ఆధ్వర్యంలో గీతాలాపన
- దేశభక్తి, జాతీయ సమైక్యతను కాపాడాలి: కంబాలపల్లి సతీష్ యాదవ్

**తొలివెలుగు, చౌటుప్పల్:** వందేమాతరం గీతాన్ని గౌరవిస్తూ దేశభక్తి, జాతీయ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీజేవైఎం నల్గొండ జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి సతీష్ యాదవ్ అన్నారు. కాంగ్రెస్ నాయకులు వందేమాతరం గీతం పట్ల అవమానకరంగా వ్యాఖ్యానించారని ఆరోపిస్తూ సోమవారం చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు పబ్బు వంశీగౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు, విద్యార్థులు తంగడపల్లి రోడ్డులోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వందేమాతరం గీతాన్ని ఆలాపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న కంబాలపల్లి సతీష్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ప్రజల్లో దేశభక్తి, స్ఫూర్తిని నింపిన వందేమాతరం గీతాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. జాతీయ చిహ్నాలు, జాతీయ గీతాలు, దేశభక్తికి సంబంధించిన ప్రతీకలను రాజకీయాలకు అతీతంగా గౌరవించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు దేశభక్తి, జాతీయ సమైక్యత, స్వాతంత్ర్య సమర విలువలను తెలియజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దిండు భాస్కర్, బీజేపీ చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దూడల బిక్షం గౌడ్, సీనియర్ నాయకులు రమణగోని శంకర్, కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, గుజ్జుల సురేందర్‌రెడ్డి, బత్తుల జంగయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుడ్డ సురేష్, కౌన్సిలర్లు ఆలే శ్రీలత చిరంజీవి, పోలేపల్లి లక్ష్మి ముత్తయ్య, ఉడుగు వెంకటేశం, బీజేవైఎం నాయకులు ఉష్కాగుల నాగరాజు, పందుల శరత్‌కుమార్, గౌతమ్, ప్రకాష్, కార్తీక్, సన్నీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

**తొలివెలుగు, మోటకొండూర్:** మోటకొండూర్ మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మోటకొండూర్ నుంచి వర్టూరు వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న గంధమల్ల రాజు (26) బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో రాజు తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో, పోలీసులు గాయపడిన రాజును చికిత్స నిమిత్తం బీబీనగర్ ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు.



అయితే అప్పటికే పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతరం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ కుమారస్వామి తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

# పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల శిక్ష

- రూ.3 వేల జరిమానా.. బాధితురాలికి రూ.50 వేల పరిహారం
- తీర్పు వెలువరించిన రంగారెడ్డి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు


**తొలివెలుగు, ఎల్‌బీనగర్ :** పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.3 వేల జరిమానా విధిస్తూ ఎల్‌బీనగర్‌లోని రంగారెడ్డి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన ఉప్పు రాకేష్ (24)పై నేరం రుజువు కావడంతో కోర్టు ఈ శిక్షను ఖరారు చేసింది. బాధితురాలికి రూ.50 వేల పరిహారం అందించాలని కూడా



ఆదేశించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీఎన్ఎస్ సెక్షన్ 78తో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 11 రెడ్‌విత్ 12 కింద నాగోల్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తును ఎస్ఐ పి.శివ నాగప్రసాద్ చేపట్టి, ఆధారాలను సేకరించి నిందితుడిపై అభియోగపత్రాన్ని కోర్టులో దాఖలు చేశారు. విచారణ సందర్భంగా నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయస్థానం మూడేళ్ల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధించింది. అలాగే బాధితురాలికి రూ.50 వేల పరిహారం అందించాలని ఆదేశించింది. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పీపీలు శోభారాణి, పి.సత్యనారాయణ వాదనలు వినిపించారు. కేసు విచారణలో నాగోల్ పోలీస్‌స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ రాజు, సమన్స్ కానిస్టేబుల్ వెంకటేష్, ఏఎస్ఐ పి.శోభ సహకరించారు.

# 830 గ్రాముల పాపాయి.. యశోద వైద్యుల అద్భుతం!

- 28 వారాలకే జననం.. అనేక ప్రాణాంతక సమస్యలను అధిగమించిన పసికందు
- 1.51 కిలోలకు పెరిగిన బరువు.. అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన మలక్‌పేట్ యశోద వైద్యులు




**తొలివెలుగు, చౌటుప్పల్:** సకాలంలో అందించిన వైద్య సేవలు, అత్యాధునిక నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ (ఎన్ఐసీయూ) సంరక్షణతో మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు 830 గ్రాముల అతి తక్కువ బరువుతో జన్మించిన పసికందును కాపాడి అరుదైన వైద్య విజయాన్ని సాధించారు. కేవలం 28 వారాల 2 రోజులకే జన్మించిన చిన్నారి అనేక ప్రాణాంతక సమస్యలను అధిగమించి 1.51 కిలోల బరువుకు చేరుకుంది. ఈ వివరాలను సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని హైవే-9 హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యులు వెల్లడించారు.

**ఒకేసారి అనేక సవాళ్లు:**

చిన్నారి తల్లికి గతంలో గర్భస్రావాలు, డీప్ వెయిన్ థ్రాంబోసిస్ (డీవీటీ), అధిక రక్తపోటు వంటి సమస్యల చరిత్ర ఉండటంతో ప్రస్తుత గర్భధారణను వైద్యులు అత్యంత హైరిస్క్‌గా పరిగణించారు. గర్భస్థ శిశువు ఎదుగుదల తగ్గడం, పిండం ప్రమాదంలో పడటంతో సకాలంలో ప్రసవం చేయాల్సి వచ్చింది. జన్మించిన అనంతరం చిన్నారికి రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్ (ఆర్‌డీఎస్), సెప్సిస్, బయోకెమికల్ మెనింజైటిస్, పేటెంట్ డక్టస్ ఆర్టీరియోసస్ (పీడీఏ), పలుమార్లు ఆక్సిజన్ స్థాయిలు పడిపోవడం వంటి పలు తీవ్రమైన సమస్యలు ఎదురయ్యాయి.

**అత్యాధునిక చికిత్సతో కోలుకున్న చిన్నారి:**

నియోనాటాలజిస్ట్ డా. సత్యప్రియ సాహూ, గైనకాలజిస్ట్ డా. లేపాక్షి దాసరి ఆధ్వర్యంలో చిన్నారికి సర్ఫాక్టెంట్ చికిత్సతో పాటు ఎన్ఐపీపీవీ, సీపీఏపీ వంటి శ్వాస సహాయాన్ని అందించారు. అవసరమైన మేరకు ఇన్సులిన్ చికిత్స, ప్రత్యేక పోషకాహార నిర్వహణ, నిరంతర ఎన్ఐసీయూ పర్యవేక్షణ చేపట్టారు. వైద్యుల నిరంతర శ్రమతో చిన్నారి ఒక్కో సమస్యను అధిగమిస్తూ క్రమంగా కోలుకుంది. చివరకు 830 గ్రాముల నుంచి 1.51 కిలోల బరువుకు చేరుకుని సురక్షితంగా బయటపడింది. కిలో కంటే తక్కువ బరువుతో జన్మించిన శిశువును అనేక సంక్లిష్ట పరిస్థితుల నుంచి కాపాడటం వైద్యరంగంలో అరుదైన విజయమని ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్‌రెడ్డి, ఏవీపీ శ్రీనివాస్ చిదుర పేర్కొన్నారు. అత్యాధునిక ఎన్ఐసీయూ సదుపాయాలు, వైద్యుల అనుభవం, సిబ్బంది నిరంతర పర్యవేక్షణతోనే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు.

# అంకిరెడ్డిగూడెంలో డంపింగ్ యార్డు వద్దు!






- నిర్మాణ పనులు నిలిపివేయాలని కలెక్టర్‌కు గ్రామస్థుల వినతి
- పాఠశాలలు, జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలని డిమాండ్
- సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ
- గ్రామ సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్

**తొలివెలుగు, చౌటుప్పల్:** అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 326లో డంపింగ్ యార్డు ఏర్పాటుకు చేపడుతున్న నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని కోరుతూ గ్రామస్థులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. లింగోజిగూడెం రెవెన్యూ పరిధిలోని స్మశానవాటిక పక్కన ఉన్న కట్ట స్థలం నుంచి మైనార్టీ పాఠశాల వెనుక భాగం వరకు డంపింగ్ యార్డు ఏర్పాటు చేసేందుకు పనులు చేపడుతున్నారని గ్రామస్థులు తెలిపారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిసర ప్రాంతాల నుంచి సేకరించే చెత్తను ఇక్కడ నిల్వ చేస్తే జనావాసాలతో పాటు మైనార్టీ పాఠశాల, జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు, సమీపంలోని రెండు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని డంపింగ్ యార్డును జనావాసాలు, పాఠశాలలకు కనీసం రెండు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

**కలెక్టర్‌కు వినతి:**

గ్రీవెన్స్ డే సందర్భంగా గ్రామ సర్పంచ్ సుర్వి మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, మహిళలు, యువకులు, వివిధ పార్టీల నాయకులు పార్టీలకతీతంగా కలిసి కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కరరావు చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి, డంపింగ్ యార్డు ఏర్పాటును నిలిపివేయాలని సూచించినట్లు గ్రామస్థులు తెలిపారు. మైనార్టీ పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులు ఉన్న విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకెళ్లారు.

**ఇతర ప్రాంతానికి తరలిస్తాం:**

డంపింగ్ యార్డును తప్పనిసరిగా ఇతర ప్రాంతానికి తరలించి ప్రజల ఆరోగ్యాలను కాపాడతామని, రెండు గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుర్వి సత్తయ్యగౌడ్, దొడ్ల అండాలు, రాపోలు రేణుక, బొమ్మని శ్రావణి, స్వామిగౌడ్, యాట శంకరయ్య, పర్ని శ్రీనివాస్‌రెడ్డి, దొడ్ల సెట్టయ్యగౌడ్, భీమగోని మల్లేశంగౌడ్, ముద్దం లక్ష్మయ్యగౌడ్, అంతటి జంగయ్యగౌడ్, రాపోలు మల్లేశం, సుర్వి నరసింహ, భీమగోని మణికుమార్, బోడెపు లక్ష్మయ్యగౌడ్, గ్రామ మహిళలు, యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

# ఆలయ చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

- పలు మండలాల్లో గంటలు, పూజా సామగ్రి చోరీ
- మరో నిందితుడు పరారీ.. భారీగా ఆలయ సామగ్రి స్వాధీనం

**తొలివెలుగు, ఆత్మకూర్(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆత్మకూర్(ఎం), మోటకొండూరు, గుండాల, వలిగొండ తదితర మండలాల్లో దేవాలయాల్లో గంటలు, పూజా సామగ్రి చోరీలకు పాల్పడుతున్న నిందితుల్లో ఒకరిని ఆత్మకూర్(ఎం) పోలీసులు అరెస్ట్ చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సోమవారం తిమ్మాపురం ఎక్స్‌రోడ్డు వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా నంబర్ ప్లేట్ లేని టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనం అనుమానాస్పదంగా కనిపించింది. వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా



చౌటుప్పల్‌కు చెందిన బండారు దుర్గ ప్రసాద్ అలియాస్ రవీందర్ పట్టుబడ్డాడు. విచారణలో జిల్లాలోని పలు మండలాల్లో దేవాలయాల్లో చోరీలకు పాల్పడినట్లు నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు.

**భారీగా సామగ్రి స్వాధీనం:**

నిందితుడి నుంచి రూ.11,200 నగదుతో పాటు రెండు పెద్ద ఆలయ గంటలు, ఐదు మధ్యతరహా గంటలు, శతగోపాలు, హారతి పళ్లెం, కలశాలు, లోహపు పాత్రలు, నాణేలు, నోట్లు ఉన్న చిన్న సంచి నుంచి రూ.1,248, చిన్న బంగారు ముక్క తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. చోరీలకు ఉపయోగించిన రెండు స్పానర్లు, రెండు స్క్రూడ్రైవర్లు, ఒక ఇనుప కడ్డీని కూడా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసులో మరో నిందితుడిగా భావిస్తున్న బండారు సాయి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతని కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న ఆలయ సామగ్రిని ఆయా ప్రాంతాల్లో నమోదైన చోరీ కేసులతో సరిపోల్చే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.

**అనుమానాస్పద వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలి:**

దేవాలయాల వద్ద భద్రతా ఏర్పాట్లు పటిష్టం చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆత్మకూర్ ఎస్ఐ లక్ష్మీనారాయణ ఆలయ నిర్వాహకులు, ప్రజలకు సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ నాయకత్వంలో, చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో, రామన్నపేట ఇన్‌స్పెక్టర్ రవి పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగింది. హెడ్ కానిస్టేబుల్ మల్లేష్, కానిస్టేబుళ్లు సైదా, విజయ్



# ఘనంగా బత్తుల వెంకటేశం జన్మదిన వేడుకలు

- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**తొలివెలుగు, రామన్నపేట:** మండల బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు బత్తుల వెంకటేశం జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెంకటేశంను చిరుమర్తి లింగయ్య శాలువాతో సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వెంకటేశం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండిన జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని వెంకటేశంకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# వృద్ధాప్య పింఛన్ల దరఖాస్తులను స్వీకరించాలి

- అవస్థలు పడుతున్న అర్హులైన వయోవృద్ధులు
- బీఆర్ఎస్ మండల నాయకుడు ఎర్రగోకుల జస్వంత్ డిమాండ్

**తొలివెలుగు, రాజపేట :** రాజపేట మండలంలో నూతన వృద్ధాప్య పింఛన్ల కోసం తక్షణమే దరఖాస్తులను స్వీకరించాలని బీఆర్ఎస్ మండల నాయకుడు ఎర్రగోకుల జస్వంత్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలో అర్హులైన వృద్ధులు అధిక సంఖ్యలో ఉన్నారని, పింఛన్లు అందక వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నూతన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించి పింఛన్లు



మంజూరు చేయాలని కోరారు. దరఖాస్తులు స్వీకరించకపోతే అనేక మంది వృద్ధులు తీవ్రంగా నష్టపోతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.



# కాంగ్రెస్ నాయకుడు కోట ఇస్తారు కన్నుమూత

- భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నేతలు
- పార్టీకి తీరని లోటన్న పాక మల్లేష్, వెంకటేష్ యాదవ్

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** మండలంలోని మెహర్ నగర్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త కోట ఇస్తారు అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు పాక మల్లేష్ యాదవ్, మండల అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ మెహర్ నగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లారు. ఇస్తారు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఇస్తారు చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఆయన కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బోధసు ఈదయ్య, గ్రామ శాఖ అధ్యక్షురాలు ఆకుల శ్రీలత మధుసూదన్, వార్డు సభ్యులు కళ్లెం సాయిలు, కుందారం మల్లేష్ యాదవ్, రేవెల్లి యాదయ్య, కోట ప్రశాంత్, కోట సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ముత్యాల శివ కుటుంబానికి పరామర్శ

- దశదిన కర్మలో పాల్గొన్న ప్రభుత్వ విప్ వేముల వీరేశం



**తొలివెలుగు, రామన్నపేట:** మండలంలోని నీర్నేముల గ్రామానికి చెందిన ముత్యాల శివ దశదిన కర్మ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా శివ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పున్న జగన్మోహన్, పట్టణ అధ్యక్షుడు ఎండీ జమీర్, గ్రామ సర్పంచ్ భూపాల్ రెడ్డి, నాయకులు శంభల వెంకన్న, సుధాకర్, విష్ణు, కృష్ణ, ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సర్పంచుల జేఏసీ రాష్ట్ర కార్యదర్శిగా విక్రమ్

- బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నియామక పత్రం అందజేత
- సర్పంచుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తా: విక్రమ్



**తొలివెలుగు, రామన్నపేట/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర సర్పంచుల జేఏసీ రాష్ట్ర కార్యదర్శిగా రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామ సర్పంచ్ గర్దాస్ విక్రమ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన జేఏసీ సమావేశంలో మాజీ మంత్రి, సర్పంచుల జేఏసీ గౌరవాధ్యక్షుడు వి.శ్రీనివాస్ గౌడ్, జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. స్థానిక సంస్థల బలోపేతం, గ్రామాల అభివృద్ధి, సర్పంచుల హక్కుల పరిరక్షణ కోసం సమిష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి విక్రమ్ కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల జేఏసీ ప్రతినిధులు, సర్పంచులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

- పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేసిన మహిళలు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం పురపాలక కేంద్రంలో వేడుకలు భక్తిశ్రద్ధలతో సాగాయి. పట్టణంలోని మహమ్మారి దేవాలయ ఆవరణలో ఉన్న పుట్ట వద్ద మహిళా భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టలో పాలు పోసి, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ముత్తయిదువులకు వాయినాలు అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. అదేవిధంగా ఆలయ ఆవరణలోని శివాలయంలోనూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# మండల ప్రజావాణికి 16 అర్జీలు




- అధికంగా రెవెన్యూ శాఖకు చెందినవే..
- తొలి వినతి అందజేసిన వయోవృద్ధుడు

**తొలివెలుగు, రాజపేట :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'మండల ప్రజావాణి' కార్యక్రమానికి ప్రజల నుంచి 16 దరఖాస్తులు వచ్చాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సాగిన ఈ దరఖాస్తుల స్వీకరణలో అత్యధికంగా 13 అర్జీలు రెవెన్యూ శాఖకు సంబంధించినవే రావడం గమనార్హం. నూతనంగా ప్రారంభించిన ఈ ప్రజావాణికి మండల స్థాయిలోని వివిధ శాఖల పూర్తిస్థాయి అధికారులు హాజరయ్యారు. కార్యక్రమంలో నోడల్ అధికారి, ఎంపీడీవో కూతల నాగవేణి మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖలకు పంపి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్జీదారులకు ఇబ్బంది కలగకుండా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి, దరఖాస్తు ముట్టినట్లు రశీదు ఇచ్చామని పేర్కొన్నారు. ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ చేసి, పురోగతిని ఫోన్ ద్వారా ఫిర్యాదుదారులకు తెలియజేస్తామన్నారు.

**కొడుకుల నుంచి రక్షణ కల్పించాలి:**

సింగారం గ్రామానికి చెందిన వయోవృద్ధుడు కడవేరుగు ఉప్పలయ్య ప్రజావాణిలో మొదటి అర్జీని సమర్పించారు. తన కుమారుల నుంచి తనకు రక్షణ కల్పిస్తూ, భవిష్యత్తులో ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను వేడుకున్నారు. గతంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని, ప్రజావాణి ద్వారా తనకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోలి రవి కిరణ్, ఎంఈఓ చందా రమేష్, వ్యవసాయ అధికారిణి పద్మజ, విద్యుత్ ఏఈ చంద్రశేఖర్, ఎంపీఓ ఆవుల కిషన్, సూపరింటెండెంట్ అల్లం ఇన్నారెడ్డి, వైద్యాధికారి బీకూ నాయక్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సందీప్ రెడ్డి, పశు వైద్యాధికారి శివరామకృష్ణ, హౌసింగ్ ఏఈ వివేకానంద్, ఈజీఎస్ కర్ణాకర్ తదితర అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను వేడుకున్నారు. గతంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని, ప్రజావాణి ద్వారా తనకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోలి రవి కిరణ్, ఎంఈఓ చందా రమేష్, వ్యవసాయ అధికారిణి పద్మజ, విద్యుత్ ఏఈ చంద్రశేఖర్, ఎంపీఓ ఆవుల కిషన్, సూపరింటెండెంట్ అల్లం ఇన్నారెడ్డి, వైద్యాధికారి బీకూ నాయక్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సందీప్ రెడ్డి, పశువైద్యాధికారి శివరామకృష్ణ, హౌసింగ్ ఏఈ వివేకానంద్, ఈజీఎస్ కర్ణాకర్ తదితర అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

- వలిగొండ ప్రజావాణిలో సీపీఎం వినతి
- రోడ్డు గుంతలు పూడ్చాలి.. 'సదరమ్' గడువు పెంచాలి: సిర్పంగి స్వామి

**తొలివెలుగు, వలిగొండ :** మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం 'ప్రజావాణి'లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. స్థానిక ఎంపీడీవో, తహసీల్దార్లకు వినతిపత్రం సమర్పించిన అనంతరం సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, మండల కార్యదర్శివర్గ సభ్యుడు కూర శ్రీనివాస్ మాట్లాడారు. మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రమైన భువనగిరికి వెళ్లే ప్రధాన బీటీ రోడ్డుపై పెద్ద ఎత్తున గుంతలు పడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కోరారు. అదేవిధంగా కొత్తగా పింఛన్లు మంజూరు చేసే ప్రక్రియలో వికలాంగులకు 'సదరమ్' సర్టిఫికెట్లు పొందేందుకు ప్రభుత్వం ఇచ్చిన గడువు సరిపోవడం లేదని, గడువును పొడిగించాలని లేదా మండల స్థాయిలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి తాత్కాలిక సర్టిఫికెట్లు అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రజావాణిని కేవలం ప్రచారానికే పరిమితం చేయకుండా బాధితుల దరఖాస్తులకు తక్షణ పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు కొండే కిష్టయ్య, కల్లూరి రామచందర్, పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ, నాయకులు సత్తయ్య, ఇందిర, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



# పవర్లూమ్ కార్మికులనూ ఆదుకోవాలి

- చేనేత, జౌళి శాఖ ఏడీ శ్రీనివాసరావుకు వినతి
- ఏడీని సన్మానించిన పవర్లూమ్ సొసైటీ నాయకులు

**తొలివెలుగు, రాజపేట:** చేనేత కార్మికుల తరహాలోనే పవర్లూమ్ కార్మికులకు కూడా 'నేతన్నకు చేయూత' పథకంలో 16 శాతం సొమ్ము ప్రభుత్వం జమ చేయాలని, బ్యాంకు రుణాలకు సబ్సిడీలు వర్తింపజేయాలని చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు (ఏడీ) శ్రీనివాసరావును రాజపేట పవర్లూమ్, పద్మశాలి సంఘాల ప్రతినిధులు కోరారు. మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస పవర్లూమ్ సొసైటీ అధ్యక్షుడు ఆడేపు రామకిష్టయ్య, శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం అధ్యక్షుడు చిన్నం వెంకటరమణల ఆధ్వర్యంలో సోమవారం ఏడీని కలసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఏడీ శ్రీనివాసరావును నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సకినాల శ్రీనివాసులు, కోశాధికారి పొట్టబతిని నరహరి, నాయకులు నరేందర్, చుంచు నారాయణ, సామల రాజు, గర్దాస్ శ్రీశైలం, వనం ఆనంద్, ఉపేందర్, చంద్రమౌళి, పెంట భాస్కర్, స్వర్గం రమేష్, వెంకటేష్, రేగొండ, ఎక్కలదేవి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



# పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలు సాధించాలి

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నోట్‌పుస్తకాల పంపిణీ

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** విద్యార్థులు పట్టుదలతో చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని భూదాన్ పోచంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ తులసి ఆకాంక్షించారు. సోమవారం కళాశాలలో ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన నోట్‌పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్కారు అందిస్తున్న సౌకర్యాలు, అవకాశాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని చదువుల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల గ్రంథపాలకుడు వెంకటేశ్వరరావు, అధ్యాపక బృందం రాజేశ్వరమ్మ, రేణుకాదేవి, స్వాతి, శ్రీదేవి, శివశంకర్, సంతోష్‌కుమార్, వెంకటరెడ్డి, వెంకటేష్, మురళీకృష్ణ, సాయివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.







# మండల ప్రజావాణికి 8 వినతులు

**- వెల్లడించిన నోడల్ అధికారి, ఎంపీడీవో విజయ**

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'మండల ప్రజావాణి'కి 8 వినతులు వచ్చినట్లు నోడల్ అధికారి, ఎంపీడీవో విజయ తెలిపారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించే లక్ష్యంతో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి పలు వినతిపత్రాలు స్వీకరించినట్లు పేర్కొన్నారు. స్వీకరించిన వాటిలో ఎంపీడీవో పరిధిలో 2, మున్సిపల్ కమిషనర్ పరిధిలో 2, సాగునీటి శాఖకు సంబంధించి 2, కలెక్టరేట్‌కు 1, విద్యుత్ శాఖ పరిధిలో 1 వినతి చొప్పున వచ్చాయని వివరించారు. ఆయా శాఖల అధికారులు అర్జీలను స్వీకరించి, సమస్యల పరిష్కార దిశగా వేగంగా చర్యలు చేపడతారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, మండల వైద్యాధికారి శ్రీవాణి, సూపరింటెండెంట్ సత్యనారాయణ రెడ్డి, ఏఎస్ఐ శంకర్ నాయక్, పంచాయతీ రాజ్ ఏఈ జగపతి తదితరులు పాల్గొన్నారు.



## బాలుర హాస్టల్ మంజూరు చేయాలి

- ఎంఈవో సుంకోజు భాస్కర్‌కు ఎస్ఎఫ్ఐ వినతి
- విద్యార్థుల కష్టాలను గుర్తించి వెంటనే స్పందించాలి: ఎస్ఎఫ్ఐ

**తొలివెలుగు, వలిగొండ :** మండల కేంద్రంలో బాలుర సంక్షేమ వసతి గృహాన్ని తక్షణమే మంజూరు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు డిమాండ్ చేశారు. మండల ప్రజావాణిలో భాగంగా సోమవారం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి (ఎంఈవో) సుంకోజు భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. గతంలో వలిగొండలో ఉన్న ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాలను ఎత్తివేయడంతో పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ హాస్టళ్ల స్థానంలో వెంటనే 'జనరల్ బాలుర వసతి గృహాన్ని' ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, మోడల్ పాఠశాలల్లో చదివే దూరప్రాంత విద్యార్థులకు వసతి లేక నిత్యం రాకపోకలు సాగించాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే వసతి గృహం మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు రహీం, రాకేష్, సాయి, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## నాపై సస్పెన్షన్ వేటు సిగ్గుచేటు

- అక్రమాలను ప్రశ్నిస్తే తప్పుడు ఆరోపణలా?
- పార్టీ సస్పెన్షన్ నిర్ణయాన్ని ఖండిస్తున్నా
- అసత్య ప్రచారాలు నమ్మవద్దు: పల్లెపాడు ఉపసర్పంచ్ నరేష్ గౌడ్



**తొలివెలుగు, ఆత్మకూర్(ఎం) :** సీపీఐ పార్టీ నుంచి తనను సస్పెండ్ చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఆత్మకూర్(ఎం) మండల పరిధిలోని పల్లెపాడు గ్రామ ఉపసర్పంచ్ బత్తిని నరేష్ గౌడ్ ఖండించారు. తనపై తప్పుడు ఆరోపణలతో అసత్య ప్రచారం చేయడం తగదని సోమవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థిగా వార్డు సభ్యుడిగా గెలిచి ఉపసర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేశానన్నారు. ఎన్నికల సమయంలో సొంత పార్టీ నాయకులే ప్రత్యర్థి పార్టీ అభ్యర్థుల నుంచి డబ్బులు తీసుకుని, తమకు వ్యతిరేకంగా ప్రచారం చేశారని ఆరోపించారు. ఈ ద్రోహంపై గ్రామీణ, మండల, జిల్లా స్థాయి సీపీఐ నాయకులకు, జిల్లా కార్యదర్శికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. పార్టీలో న్యాయం జరగకపోవడంతోనే వేరే మార్గం లేక సొంత ఇష్టంతో పార్టీ మారినట్లు స్పష్టం చేశారు. స్వచ్ఛందంగా పార్టీ వీడిన తర్వాత కూడా తనపై తప్పుడు ప్రచారాలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు.

## మండల స్థాయిలోనే 'ప్రజావాణి' దరఖాస్తుల స్వీకరణ

- ఆత్మకూర్(ఎం)లో తొలిరోజు 5 వినతులు




**తొలివెలుగు, ఆత్మకూర్(ఎం) :** ప్రభుత్వ నూతన నిర్ణయం మేరకు ఇకపై ప్రతి సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోనే 'మండల ప్రజావాణి' నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జిల్లా కలెక్టరేట్ వరకు వెళ్లే శ్రమ లేకుండా ఎంపీడీవో కార్యాలయంలోనే నేరుగా వినతిపత్రాలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన మొదటిరోజు కార్యక్రమానికి మొత్తం 5 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. ఇందులో రెవెన్యూ పరిధిలో 2, వ్యవసాయ శాఖకు 1, విద్యుత్ శాఖకు 1, హౌసింగ్ బోర్డుకు సంబంధించి 1 దరఖాస్తు అందినట్లు వివరించారు. అందిన వినతులపై సత్వర పరిష్కారం కోసం తక్షణమే విచారణ ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.లావణ్య, వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాస్, డిఆర్‌డిఏ అధికారి నాగిరెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ ప్రవీణ్ తదితర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

- రూ.5 వేలు అందజేసిన తోటి డ్రైవర్లు

**తొలివెలుగు, రాజపేట :** రాజపేట మండలం పారుపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రావుల బాలకిషన్ అకాల మరణం చెందగా.. ఆయన కుటుంబాన్ని తోటి ఆటో డ్రైవర్లు పరామర్శించి రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం పారుపల్లిలో నిర్వహించిన సంతాప కార్యక్రమంలో కడారు బాలయ్య ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. బాలకిషన్ చిత్రపటానికి పూలమాలలు వేసి అశ్రునయాన నివాళులర్పించారు. తోటి మిత్రుడిని కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి తామంతా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు జన్న శ్రీను, బుర్రి మల్లయ్య, మోదె సిద్ధులు, భూపతి బాబు, గడ్డం సిద్ధులు, భూపతి శ్రీను, కడారి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.




# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- 'గ్రీవెన్స్'లో అధికారులకు వినతిపత్రం అందజేత

**తొలివెలుగు, రాజపేట :** రాజపేట మండలంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన 'గ్రీవెన్స్'లో జర్నలిస్టులు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. రాజపేట మండల జర్నలిస్ట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పెంట రమేష్, అధ్యక్షుడు ఉప్పల రమేష్, కార్యదర్శి బాలరాజు ఆధ్వర్యంలో మండలంలోని 25 మంది జర్నలిస్టుల తరపున ఈ అర్జీని అందజేశారు. నోడల్ అధికారి కూతల నాగవేణి ద్వారా తహసీల్దార్ గోలి రవి కిరణ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. దాదాపు 40 ఏళ్ల నుంచి జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్న రిపోర్టర్లకు కూడా ఇప్పటివరకు నివేషణ స్థలాలు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాతో పాటు ఆలేరు నియోజకవర్గంలోని మిగతా అన్ని మండలాల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చినప్పటికీ, రాజపేట మండలంలో మాత్రం అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హులైన జర్నలిస్టులందరికీ ప్లాట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.



# రాజపేట నుంచి ఆలేరుకు బస్సు సౌకర్యం కల్పించాలి




- 'ప్రజావాణి'లో బీసీ సంక్షేమ సంఘం వినతి
- అధికారులు స్పందించకుంటే ఆందోళన బాట: జూకంటి

**తొలివెలుగు, రాజపేట :** రాజపేట మండల కేంద్రం నుంచి నియోజకవర్గ కేంద్రమైన ఆలేరుకు వెంటనే బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి'లో నోడల్ అధికారి నాగవేణికి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజపేట నుంచి ఆలేరు, యాదగిరిగుట్టకు వెళ్లేందుకు ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు, వర్తకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సోమవారం గ్రామం మీదుగా ఆలేరుకు రోజుకు మూడు ట్రిప్పులు, యాదాద్రికి ఐదు ట్రిప్పుల చొప్పున బస్సులు నడపాలని కోరారు. రవాణా సౌకర్యం లేక ప్రజలు పడుతున్న అవస్థలపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందన లేదన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని రవాణా సౌకర్యం కల్పించకపోతే బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఏమ్మా శ్రీనివాస్, కర్రె కిషన్, వస్పరి రవీందర్, కర్రె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## నిషేధిత జాబితా నుంచి ఇళ్లను తొలగించాలి

- 40 ఏళ్లుగా నివాసముంటున్నా ఆగమ్యగోచరంగా మారిన భవిష్యత్తు
- తహసీల్దార్ రవికిరణ్, ఎంపీడీవో నాగవేణిలకు గ్రామస్థుల ఆవేదన

**తొలివెలుగు, రాజపేట :** మండలంలోని చల్లూరు గ్రామంలోని 140 ఇళ్లను 22/ఎ నిషేధిత జాబితా నుంచి వెంటనే తొలగించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ రవికిరణ్, ఎంపీడీవో నాగవేణిలకు ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. దాదాపు 40 ఏళ్ల నుంచి నివాసముంటున్న నిరుపేదల ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చడంతో తమ భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తుల క్రయవిక్రయాలు జరగక విలువ పడిపోతోందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ ఇళ్లను 22/ఎ జాబితా నుంచి మినహాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరసింహ, పల్లెపాటి పాండరి, బ్రహ్మచారి, కొంగరి స్వామి, గుజ్జుక సందీప్, తిరుపతి, గణేష్, రాజమణి, బుచ్చమ్మ, నరసయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సర్కారు బడులే భవిష్యత్తుకు బాటలు

- నమిల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఈఓ చందా రమేష్
- ఉపాధ్యాయుల బోధనా తీరుపై ప్రశంసలు

**తొలివెలుగు, రాజపేట :** విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేయడం ఒక్క ప్రభుత్వ పాఠశాలల్లోనే సాధ్యమని రాజపేట మండల విద్యాధికారి (ఎంఈఓ) చందా రమేష్ అన్నారు. సోమవారం రాజపేట మండల పరిధిలోని నమిల ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యాబోధన, విద్యార్థుల అభ్యసన స్థాయిలు, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులను సకాలంలో అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థుల ప్రతిభను పరిశీలించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల్లో భయరాహిత్య వాతావరణం కల్పిస్తూ ఆటపాటలతో కూడిన స్వేచ్ఛాపూరిత బోధన అందించాలని స్పష్టం చేశారు. పాఠశాలలో హెచ్ఎం నమిల భరత్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరుగుతున్న విద్యాబోధన, నిర్వహణ తీరును ఎంఈఓ ప్రత్యేకంగా అభినందించారు. కష్టంతో కాకుండా ఇష్టంతో పిల్లలు బడికి వచ్చేలా నిర్వహించడం ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కందుల మమత, నగేష్, మేక సాయి కృప, మన్న భార్గవి తదితరులు పాల్గొన్నారు.





## ఆక్రమించిన నక్షాబాటను పునరుద్ధరించాలి

- తహసీల్దార్, ఎంపీడీవోలకు బొందుగుల గ్రామస్థుల వినతి
- వెంచర్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్

**తొలివెలుగు, రాజపేట :** మండలంలోని బొందుగుల గ్రామంలో రియల్ ఎస్టేట్ వెంచర్ యాజమాన్యం ఆక్రమించిన నక్షాబాటను తక్షణమే పునరుద్ధరించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్, ఎంపీడీవోలకు ఎంఆర్‌పీఎస్ నాయకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామంలోని సర్వే నంబర్లు 141, 142లలో బొందుగుల నుంచి జిల్లా సరిహద్దు వరకు ఉన్న నక్షాబాటను 'యుఎస్ఎమ్ మై సిటీ' వెంచర్ నిర్వాహకులు ఆక్రమించి ఫెన్సింగ్ వేశారని ఆరోపించారు. మూడేళ్లుగా ప్రజలు నడవకుండా రాకపోకలను నిలిపివేశారని, దారి స్థలంలో గంధం చెట్లు నాటడమే కాకుండా ప్లాట్లుగా చేసి అమ్ముతున్నారని పేర్కొన్నారు. దారి గురించి ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడుతున్నారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, వెంచర్ అనుమతులను రద్దు చేసి ప్రజల బాటను పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు గొల్లూరి ప్రభాకర్, ప్రకాష్, రవి, రమేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా నాగుల పంచమి వేడుకలు

- పుట్టల్లో పాలు పోసి మొక్కులు చెల్లించిన మహిళలు
- రద్దీగా మారిన6ఎ ఆధ్యాత్మిక క్షేత్రాలు

**తొలివెలుగు, రాజపేట :** రాజపేట మండలంలో నాగుల పంచమి పర్వదినాన్ని సోమవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయబద్ధంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు కుటుంబ సమేతంగా సమీపంలోని నాగేంద్రుని పుట్టల వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టల్లో పాలు పోసి, నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రాజపేటలోని పోచమ్మ ఆలయంతో పాటు స్థానిక దేవాలయాలను దర్శించుకుని ప్రత్యేక అర్చనలు చేశారు. ఈ సందర్భంగా నాగుల పంచమి విశిష్టతను గ్రామ పురోహితులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ వివరించారు. శ్రావణ మాసంలో వచ్చే నాగుల పంచమి నాడు నాగేంద్రుడిని ఆరాధించడం వల్ల సర్పదోషాలు తొలగి, కుటుంబానికి సౌభాగ్యం, ఆయురారోగ్యాలు చేకూరుతాయని తెలిపారు.






# ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

**- చౌటుప్పల్‌లో వాల్ పోస్టర్ ఆవిష్కరణ**

**- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్‌రెడ్డి**

**చౌటుప్పల్, తొలి వెలుగు:** యాదగిరిగుట్టలో సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ 3వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం చౌటుప్పల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పల్లె శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. ప్రజాస్వామ్య, లౌకిక విలువల పరిరక్షణకు ఏఐవైఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. యువత చెడు వ్యసనాలు, దురలవాట్లకు దూరంగా ఉంటూ అవినీతి, దోపిడీ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. సమగ్ర యువజన విధానం అమలుతో పాటు విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం ఏఐవైఎఫ్ పోరాడుతోందని పేర్కొన్నారు. యాదగిరిగుట్టలో జరిగే రాష్ట్ర మహాసభలు భవిష్యత్ యువజన ఉద్యమాలకు దిక్సూచిగా నిలుస్తాయని ఆకాంక్షించారు. మహాసభలకు యువత అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరు వెంకటేష్, మండల అధ్యక్షుడు గుండెబోయిన భాస్కర్, కార్యదర్శి బరిగెల వేణు, నాయకులు ఉడుత రాజు, బత్తుల సాయి తేజ, భాను, సీపీఐ నాయకులు ఉడుత రామలింగం, బద్దుల సుధాకర్, టంగుటూరి రాములు తదితరులు పాల్గొన్నారు.



# డంపింగ్ యార్డు నిర్మాణాన్ని నిలిపివేయాలి

**- మున్సిపల్ కమిషనర్‌కు బిజెపి వినతిపత్రం**

**తొలివెలుగు, చౌటుప్పల్ :** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం రెవెన్యూ సర్వే నంబర్ 326లో ఏర్పాటు చేస్తున్న ఎస్వీ2డంపింగ్ యార్డు పనులను తక్షణమే నిలిపివేసి, వేరే ప్రాంతానికి తరలించాలని బిజెపి చౌటుప్పల్ మున్సిపాలిటీ అధ్యక్షురాలు కడారి కల్పనా యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జనావాసాలు, పాఠశాలలకు సమీపంలో డంపింగ్ యార్డు నిర్మించడం వల్ల తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపాదిత స్థలానికి 500 మీటర్ల దూరంలోనే మైనార్టీ పాఠశాల, లింగోజిగూడెం హైస్కూల్ ఉన్నాయని, సుమారు 1,000 మంది విద్యార్థులు దుర్వాసనతో అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందన్నారు. చెత్త నిల్వ వల్ల ఈగలు, దోమలు పెరిగి మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలుతాయని తెలిపారు. అలాగే భూగర్భ జలాలు కలుషితమై తాగునీరు విషతుల్యమవుతుందని, పాడి పంటలు దెబ్బతింటాయని పేర్కొన్నారు. అధికారులు స్పందించి డంపింగ్ యార్డును జనావాసాలు, బడులకు కనీసం 2 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుడ్డ సురేష్, కడారి ఐలయ్య, కాంచర్ల నాగభూషణం, బత్తుల భంగయ్య గౌడ్, పల్లె సాంబశివారెడ్డి, ఊడుగు వెంకటేష్ గౌడ్, ఉపాసల నాగరాజు, కాసుల వెంకటేశం, వనం ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత

**- రూ.16,300 అందజేసిన బాబు జగ్జీవన్ రామ్ యువజన సంఘం**

**తొలివెలుగు, రామన్నపేట:** ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముత్యాల శివ కుటుంబానికి బాబు జగ్జీవన్ రామ్ యువజన సంఘం సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. శివ మరణవార్త తెలుసుకున్న సభ్యులు మానవతా దృక్పథంతో స్పందించి, బాధిత కుటుంబానికి తమ వంతుగా రూ.16,300ల నగదును అందజేశారు. ఈ సందర్భంగా యువజన సంఘం సభ్యులు మాట్లాడుతూ.. ఆపద సమయంలో తోటివారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. శివ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి ఆపన్నహస్తం అందించిన బాబు జగ్జీవన్ రామ్ యువజన సంఘం సభ్యులను స్థానికులు అభినందించారు.



# ఝార్ఖండ్‌లోనూ విద్యార్థులదే పైచేయి.. దిగొచ్చిన ప్రభుత్వం.. జేఎస్ఎస్ సీ–సీజీఎల్ పరీక్ష రద్దు

**ఝార్ఖండ్ లో ఫలించిన విద్యార్థుల పోరాటం హేమంత్ సోరెన్ సర్కార్ కీలక నిర్ణయం**

**వివాదాస్పద పరీక్ష రద్దు, విచారణకు ఆదేశం!**

**పరీక్షల నిర్వహణ సంస్థ టీడీపీఎల్‌పై వేటు, అన్ని పరీక్షలు రద్దు**

**2014 నుంచి జరిగిన అక్రమాలపై విచారణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు**

ఝార్ఖండ్‌లో ఉద్యోగార్థులు, విద్యార్థులు సాగించిన సుదీర్ఘ పోరాటం ఫలించింది. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన ఝార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ (జీూజ-జ+ూ) పరీక్షను రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రకటించారు. పేపర్ లీకేజీ, అక్రమాల ఆరోపణల నేపథ్యంలో విద్యార్థులు చేపట్టిన నిరసనలకు ప్రభుత్వం దిగివచ్చింది. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో అభిజీత్ దీప్కే నేతృత్వంలో సీజేపీ నిర్వహించిన జెన్ జీ ఉద్యమం సఫలం అయిన నేపథ్యంలో, ఝార్ఖండ్ విద్యార్థుల ఉద్యమంపై జాతీయ స్థాయిలో ఆసక్తి నెలకొంది సోమవారం సీఎం హేమంత్ సోరెన్ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశం అనంతరం ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న లక్నోకు చెందిన 'టీడీపీఎల్' (ూ= ఐఖ్ఞు ౖాతీశీఎవంంఱఅస్త్ర ౖాతీఱఙఖ్వ ూాఱఎఙవం) అనే ప్రైవేట్ సంస్థ నిర్వహించిన అన్ని పరీక్షలను రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. "టీడీపీఎల్ సంస్థకు సంబంధించిన అన్ని కార్యకలాపాలను రద్దు చేయాలని నిర్ణయించాం. ఆ సంస్థ నిర్వహించిన పరీక్షలు, ప్రకటించిన ఫలితాలు, ఎంపికైన అభ్యర్థుల జాబితాలు సహా అన్నీ రద్దవుతాయి" అని సోరెన్ మీడియాకు వివరించారు. ఈ అక్రమాలపై సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. సీనియర్



ఐఏఎస్ అధికారి అమితాబ్ కౌశల్ నేతృత్వంలో ఒక ప్రత్యేక పరీక్షల సంస్కరణల కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం తెలిపారు. ఈ కమిటీ 2014 నుంచి జరిగిన నియామక పరీక్షల్లోని లోపాలు, అవకతవకలపై దర్యాప్తు చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. ప్రభుత్వ నిర్ణయంతో గత 24 రోజులుగా నిరసనలు చేస్తున్న విద్యార్థులు, అభ్యర్థులు ఆనందంలో మునిగిపోయారు. రాంచీలోని జైపాల్ సింగ్ స్టేడియంలో ఒకరికొకరు అభినందనలు తెలుపుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. ఈ పోరాటానికి నాయకత్వం వహించిన విద్యార్థి నాయకుడు దేవేంద్ర నాథ్ మహతో ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. అయితే, విచారణ పారదర్శకంగా జరగాలని, తమ ప్రధాన డిమాండ్ అయిన సీబీఐ విచారణపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.

# భోగాపురం నుంచి ప్రారంభమైన విమాన సర్వీసులు..

ఉత్తరాంధ్ర యువత కలలకు, ఆకాంక్షలకు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కొత్త రెక్కలు తొడుగుతుందని, ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధిలో ఇదొక చారిత్రక ఘట్టమని ముఖ్యమంత్రి చంద్రబాబు అభివర్ణించారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ నుంచి విమాన సర్వీసులు ప్రారంభమైన సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్ర పారిశ్రామిక, పర్యాటక రంగాలకు సరికొత్త ఊపునిస్తుందని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను గణనీయంగా పెంచుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ, విజయనగరం జిల్లాలోని 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' (భోగాపురం) నుంచి సోమవారం వాణిజ్య విమాన సర్వీసులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ నుంచి వచ్చిన ఇండిగో విమానం ఇక్కడ తొలిసారిగా ల్యాండ్ అవ్వడంతో కార్యకలాపాలు మొదలయ్యాయి. ఈ చారిత్రక ఘట్టానికి గుర్తుగా, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తొలి ప్రయాణికులకు బోర్డింగ్ పాస్‌లు అందజేసి సర్వీసులను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం బెంగళూరు నుంచి వచ్చిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం కూడా ఇక్కడికి చేరుకుంది. దాదాపు రూ.5,000 కోట్ల భారీ వ్యయంతో జీఎంఆర్ గ్రూప్ ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని అత్యంత ఆధునిక ప్రమాణాలతో నిర్మించింది. తొలి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యంతో దీన్ని



రూపొందించారు. భవిష్యత్తులో ఈ సామర్థ్యాన్ని 4 కోట్ల మందికి పెంచేలా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), బయోమెట్రిక్ సాంకేతికత వంటి అత్యాధునిక సదుపాయాలను ఇందులో పొందుపరిచారు. ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ 'చుట్టిల్లు' ఆకారం, అరకు లోయల స్ఫూర్తితో టెర్మినల్ డిజైన్‌ను తీర్చిదిద్దడం విశేషం. ఈ విమానాశ్రయానికి మెరుగైన కనెక్టివిటీ కోసం ప్రభుత్వం ఏడు ప్రధాన రహదారులను విస్తరిస్తోంది. విశాఖపట్నం–భోగాపురం మధ్య బీచ్ కారిడార్ నిర్మాణానికి కూడా ఆమోదం తెలిపింది. కాగా, ఆగస్టు 1వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. భోగాపురంలో సేవలు మొదలవ్వడంతో, విశాఖపట్నంలోని పాత విమానాశ్రయంలో షెడ్యూల్డ్ వాణిజ్య సర్వీసులను పూర్తిగా నిలిపివేశారు. ఆ విమానాశ్రయాన్ని ఇకపై కేవలం ప్రైవేట్, రక్షణ రంగ విమానాల కోసం మాత్రమే ఉపయోగించనున్నారు. ఈ ప్రాజెక్టుకు భూములిచ్చి సహకరించిన రైతులకు, దీనిని సాకారం చేసిన జీఎంఆర్ యాజమాన్యానికి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే భారీ కుట్ర భగ్నం: అమిత్ షా

పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతుతో కార్యకలాపాలు సాగిస్తున్న 'షాజాద్ భట్టి నెట్‌వర్క్' అనే ఉగ్రవాద ముఠాను పూర్తిగా నిర్మూలించినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే దేశంలో విధ్వంసక దాడులు చేసేందుకు పన్నిన భారీ కుట్రను భద్రతా బలగాలు భగ్నం చేశాయని, ఈ క్రమంలో 14 రాష్ట్రాల్లో 200 మందికి పైగా నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు.ఴఈ మేరకు అమిత్ షా సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వివరాలను వెల్లడించారు. భద్రతా బలగాలు సమన్వయంతో చేపట్టిన ఆపరేషన్ల ద్వారా ఈ నెట్‌వర్క్‌ను ఛిన్నాభిన్నం చేసినట్లు పేర్కొన్నారు. ఉగ్రవాదంపై నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న జీరో టాలరెన్స్ విధానానికి ఈ విజయమే నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఆగస్టు 12వ తేదీన దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ ఆపరేషన్?లలో మొత్తం 253 మందిని అదుపులోకి తీసుకోగా, 200 మందికి పైగా నిందితులను అధికారికంగా అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు 80కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 62 మంది, హర్యానాలో 52, ఢిల్లీలో 51, పంజాబ్‌లో 44 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి ఐఈడీలు, పాకిస్థాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ముద్రలు కలిగిన గ్రెనేడ్లు, పిస్టళ్లు, మందుగుండు సామాగ్రితో పాటు గూఢచర్యం కోసం వినియోగించే రహస్య కెమెరాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. షాజాద్ భట్టి నెట్‌వర్క్, ప్రధానంగా గ్రెనేడ్, ఐఈడీలు, పెట్రోల్ బాంబు దాడులతో పాటు లక్షిత హత్యలకు కుట్ర పన్నుతున్నట్లు అధికారులు వివరించారు. పోలీసు స్టేషన్లు, రక్షణ సంస్థలు, మతపరమైన ప్రదేశాలపై నిఘా ఉంచేందుకు ఈ ముఠా స్థానికులకు భారీగా నగదు చెల్లించిందని ప్రాథమిక విచారణలో వెల్లడైంది.





## నాన్‌స్టాప్‌గా 'రాపో23'

హీరో రామ్ పోతినేని స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న తాజా చిత్రం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. 'రాపో23' వర్కింగ్ టైటిల్‌తో సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే పుదుచ్చేరి శివార్లలో 24 గంటల పాటు నిర్విరామంగా ఈ సినిమా షూటింగ్‌ను జరిపారు. హీరోగా, దర్శకుడిగా ఈ సినిమా కోసం రామ్ ఎంతగానో శ్రమిస్తున్నారని, ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నారని యూనిట్ వర్గాలు తెలిపాయి. 'పుదుచ్చేరిలో వేసిన భారీ సెట్‌లో తొమ్మిది రోజుల పాటు షూటింగ్ జరిపాం. ఇటీవల వర్షాల కారణంగా షెడ్యూల్‌కు బ్రేక్‌పడింది. త్వరలో మళ్లీ షూటింగ్‌ను మొదలుపెడతాం' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్, నిర్మాత:కృష్ణ పోతినేని.



## నిశ్శబ్ద విధ్వంసం

సాధారణంగా స్టార్ హీరోల ఇంట్రోస్ అంటే తెరపై ఓ రేంజ్ హంగామానే సృష్టిస్తారు దర్శకులు. భారీ డీజే సౌండ్ల మధ్య, రౌడీల హాహాకారాల మధ్య హీరో తెరపై ఎంట్రీ ఇస్తాడు. అంతే అభిమానుల్లో పూనకాలు మొదలవుతాయి. కానీ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా శైలి ప్రత్యేకం. 'స్పిరిట్'లో ప్రభాస్ ఎంట్రీని ఆయన చాలా భిన్నంగా ప్లాన్ చేసినట్టు ఇన్‌సైడ్ టాక్. సెంట్రల్ జైల్లో ఉన్నట్టుండి గందరగోళం చెలరేగడం.. ఖైదీలందరూ నియంత్రణ కోల్పోవడం.. పోలీసులు సైతం పరిస్థితిని అదుపు చేయలేకపోవడం.. ఈ విధ్వంసం మధ్య నిశ్శబ్దంగా ఓ హిందీ క్లాసిక్ సాంగ్ వింటూ సైలెంట్‌గా, సైకోటిక్‌గా ప్రభాస్ ఎంట్రీ ఇస్తారట. అయితే.. ఈ సన్నివేశంలో ప్రభాస్‌ని వెంటనే రివీల్ చేయకుండా, ఖైదీల కళ్లలో కనిపించే భయం ద్వారా ప్రభాస్ పాత్రకు ఎలివేషన్ ఇస్తూ, నిదానంగా ప్రభాస్‌ని రివీల్ చేస్తారట. ప్రభాస్ కెరీర్‌లోనే ప్రత్యేకంగా చెప్పుకునేలా ఈ ఇంట్రడక్షన్ ఉంటుందని వినికిడి. త్రిప్తి డిమ్రీ కథానాయికగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రం వచ్చే ఏడాది మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. సీనియర్ నటి కాంచన, వివేక్ ఒబెరాయ్, ప్రకాశ్‌రాజ్ ఇందులో కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, నిర్మాణం: టి–సిరీస్, భద్రకాళి పిక్చర్స్.

## నవంబర్‌లో యాక్షన్ షురూ?

అల్లు అర్జున్‌తో లోకేష్ కనకరాజ్ సినిమా ప్రకటన వెలువడిన నాటి నుంచి అభిమానులు ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ అప్‌డేట్స్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'పుష్ప' ఫ్రాంఛైజీ సినిమాలతో బన్నీ ఇమేజ్ తారాస్థాయికి చేరింది. మరోవైపు యాక్షన్, మాఫియా కథాంశాలతో వరుస హిట్స్ అందిస్తూ సరికొత్త ట్రెండ్ క్రియేట్ చేశారు దర్శకుడు లోకేష్ కనకరాజ్. దాంతో వీరిద్దరి కాంబినేషన్ సినిమాపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ సినిమా కోసం లోకేష్ కనకరాజ్ తన పంథాకు భిన్నంగా వినూత్న కథాంశాన్ని సిద్ధం చేస్తున్నారని, పౌరాణిక..ఫాంటసీ అంశాలు కలబోసిన కథ ఇదని వార్తలొస్తున్నాయి. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమా నవంబర్‌లో సెట్స్‌మీదకు రానుందని తెలిసింది. బాలీవుడ్‌కి చెందిన ఓ అగ్ర హీరో ఈ సినిమాలో నటించనున్నారనే టాక్ కూడా వినిపిస్తున్నది.





## అలా చేస్తే కెరీర్ వేరేలా ఉండేది

'డాక్టర్ కావాలనుకొని యాక్టర్ అయ్యాను' అని చాలామంది హీరోయిన్లు చెబుతుంటారు. సాయిపల్లవి, శ్రీలీల లాంటి హీరోయిన్లయితే.. డాక్టర్ చదివి కూడా యాక్టర్లయిపోయారు. మలయాళ మందారం ఐశ్వర్య లక్ష్మి కూడా వారి దారిలోనే డాక్టర్ చదివి యాక్టరై విజయాలను అందుకుంటున్నది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'అనుకున్నది జరక్కపోవడమే జీవితం. నన్ను డాక్టర్‌గా చూడాలని మా అమ్మానాన్నల కోరిక. నేను కూడా కష్టపడి హౌస్ సర్జన్ చేశాను. ప్రాక్టీస్ మొదలుపెడితే నా కెరీర్ వేరేలా ఉండేదేమో. కానీ నేను అనుకోకుండా మోడలింగ్ వైపు మళ్లాను. తర్వాత సినిమా పిలిచింది. తొలినాళ్లలో అమ్మానాన్నకు నా ప్రవర్తన మింగుడు పడలేదు. విజయాలు రావడం, నా నటనను అంతా మెచ్చుకోవడం.. ఇవన్నీ చూసి వాళ్లు కూడా సైలెంట్ అయిపోయారు' అంటూ ఐశ్వర్య లక్ష్మి చెప్పుకొచ్చింది. సాయిదుర్గతేజ్‌కు జోడీగా ఆమె నటించిన 'సంబరాల ఏటిగట్టు' సినిమా త్వరలోనే విడుదల కానున్నది.

## అందానికి అదృష్టం తోడైతే ఇలాగే ఉంటుంది మరి!

ఒకప్పుడు మీనా .. రంభ .. నగ్మా వంటి బొద్దుగా ఉన్న బ్యూటీలు తెలుగు తెరను ఒక ఊపు ఊపేశారు. స్టార్ హీరోలతో కలిసి వరుస విజయాలను అందుకుంటూ, తమ కెరియర్ ను పరుగులు తీయించారు. అలా కాస్త బొద్దుగా కనిపిస్తూ .. క్యూట్ ఎక్స్ ప్రెషన్స్ తో ఈ మధ్య కాలంలో యూత్ ను ఆకట్టుకున్న బ్యూటీగా రితికా నాయక్ కనిపిస్తుంది. 'మిరాయ్' సినిమాలో ఈ సుందరిని చూసిన కుర్రాళ్లు, థియేటర్స్ దగ్గరే మనసులు పోగొట్టుకున్నారు. ఈ ముద్దుగుమ్మ నెలకో సినిమా చేస్తే బాగుండునే అనుకున్నారు. కానీ 'మిరాయ్' మాదిరిగానే తనకి బాగా నచ్చే కంటెంట్ కోసం రితికా ఎదురుచూస్తూ వచ్చిందనే విషయం, 'కొరియన్ కనకరాజు' రిలీజ్ తరువాతనే అర్థమవుతోంది. రీసెంటుగా విడుదలైన ఈ సినిమా, అనూహ్యమైన రెస్పాన్స్ ను అందుకుంది. కొంత కాలంగా అసంతృప్తిగా ఉన్న వరుణ్ తేజ్ కి ఈ సినిమా ఫలితం ఊరటను ఇచ్చింది .. కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ సినిమాలోను నటన పరంగా .. గ్లామర్ పరంగా రితికా మంచి మార్కులు కొట్టేసింది. అందానికి అదృష్టం తోడైతే ఇలాగే ఉంటుందని అనిపించింది. కొంత కాలంగా టాలీవుడ్ లో హీరోయిన్స్ వైపు నుంచి సందడి తగ్గిందనే చెప్పాలి. ఒకటి రెండు సినిమాలు చేసుకుపోతున్నారే తప్ప, నిలకడగా ఎవరూ సక్సెస్ లు సాధించలేకపోతున్నారు. టాప్ త్రీ .. టాప్ 5 అంటూ గతంలో మాదిరిగా ఒక జాబితా చూసుకుంటే, ఎవరూ కనిపించని ఒక గందరగోళం ఉంది. అలాంటి పరిస్థితుల్లో మరో భారీ హిట్ ను అందుకున్న రితికా, మరిన్ని అవకాశాలతో బిజీ అవుతుందేమో చూడాలి.



Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: